ఆలయాల పాలకమండలిలో బీసీలను నియమించాలి



మంత్రి కొండా సురేఖకు వినతి పత్రం ఇస్తున్న రాజేశ్వర్ యాదవ్ తదితరులు

చార్మినార్: ఆలయాల పాలక మండలిలో 42 శాతం బీసీలను నియమించాలని కోరుతూ బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు ఏ.రాజేశ్వర్ యాదవ్ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను శనివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇందుకు సంబంధించిన ఆదేశాలను జారీ చేయాలని మంత్రిని కోరినట్లు ఆయన తెలిపారు.

మంత్రిని కలిసిన నాయకులు



గౌలిపురా: రాష్ట్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన వాకిటి శ్రీహరిని చార్మినార్ నియోజకవర్గ కాంగ్రెస్ మాజీ ఇన్‌చార్జి కె.వెంకటేశ్ గాంధీ భవన్‌లో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. త్వరలో సచివాలయంలో బాధ్యతల స్వీకార కార్యక్రమానికి హాజరు కావాలని వెంకటేశ్‌ను మంత్రి ఆహ్వానించారు.

గౌలిపురా డివిజన్ అభివృద్ధికి కృషి



ఫ్లోరింగ్ పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ ఆలె భాగ్యలక్ష్మి

గౌలిపురా: గౌలిపురా డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తున్నానని కార్పొరేటర్ ఆలె భాగ్యలక్ష్మి అన్నారు. బాలాగంజ్ ప్రాంతంలో జీహెచ్ఎంసీ నిధులు రూ.5.90 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు జి.రఘుకాంత్, జమాల్‌పూర్ అశోక్, రమేశ్ యాదవ్, కె.సాయి కుమార్, సీహెచ్.నర్సింగ్ రావు, రజనీ, యశ్వంత్ గౌడ్, లావణ్య, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

జాంసింగ్ ఆలయంలో నిజరూప దర్శనం



అబిడ్స్: చారిత్రాత్మక గుడిమల్కాపూర్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ఉదయం స్వామికి అభిషేకం, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించి నిజరూప దర్శనం ప్రారంభించారు. గుడిమల్కాపూర్‌తో పాటు మహేశ్‌నగర్, గాయత్రీనగర్, సత్యనారాయణ కాలనీ, బాలాజీనగర్, తదితర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

భక్తుల కొంగు బంగారం..

- కోట మైసమ్మ అమ్మవారు
- ఏటా ప్రత్యేక పూజలు
- మూడంతస్తుల్లో వివిధ రూపాల్లో దర్శనం
- బోనాల జాతరకు ముస్తాబవుతున్న ఆలయం



కోట్లాఆలిజాలోని కోట మైసమ్మ ఆలయంలో కొలువుదీరిన అమ్మవారు

చార్మినార్: రాష్ట్రంలోనే అత్యంత పురాతనమైన కోట్లా ఆలిజాలోని కోట మైసమ్మ ఆలయం భక్తుల పాలిట కొంగు బంగారంగా నిలుస్తోంది. 400 ఏళ్ల క్రితం భాగ్యనగరం ఏర్పడినప్పుడు దాని చుట్టూ గోడలు, దర్వాజాలు రక్షణగా నిర్మించారు. అయితే నూతన పనులకు ముందు శక్తి పూజ చేయడం ఆనవాయితీగా వస్తుండడంతో అప్పట్లోనే ఎన్నో ఆలయాలు కట్టారు. ఇందులో భాగంగా కోట మైసమ్మ మందిరం కూడా నిర్మించారని పూర్వీకులు పేర్కొంటున్నారు. రాష్ట్రంలోనే మూడంతస్తుల ఉన్న ఏకైక మందిరం కోట మైసమ్మ అమ్మవారిదే. ఏటా బోనాల జాతర ఉత్సవాల సందర్భంగా ప్రతి అంతస్తులో అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిస్తుంటారు.

నిజాం కాలంలో నిర్మించిన దర్వాజల్లో..

నిజాం కాలంలో నిర్మించిన దర్వాజల్లో కొన్ని శిథిలావస్థకు చేరుకోగా మరికొన్ని పూర్తిగా కనుమరుగయ్యాయి. ప్రస్తుతం కోట మైసమ్మ ఆలయం వద్ద ఇంకా దర్వాజ అందుబాటులో ఉంది. అప్పటి నుంచి ఇప్పటివరకు బోనాల జాతర ఉత్సవాలు ఇక్కడ కనుల పండువగా కొనసాగుతున్నాయి. ఈసారి కూడా బోనాల జాతర ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి ఘటం సామూహిక ఊరేగింపుకు ఎంతో ప్రాధాన్యత ఉంది. ఇందులో భాగంగా టెంపుల్ నుంచి బయలుదేరే అమ్మవారి ఘటం ఊరేగింపు సఫిల్ కోట మైసమ్మ, రంగేలికిడికి, ఎతేబార్ చౌక్, గుల్జార్ హౌజ్, చార్మినార్ భాగ్యలక్ష్మీ ఆలయం, చౌక్ మైదాన్ ఖాన్, బీబీబజార్ ద్వారా తిరిగి ఆలయానికి చేరుకుంటుంది.

బోనాలను వైభవంగా నిర్వహిస్తాం..



కోట్లాఆలిజాలోని కోట మైసమ్మ ఆలయం అమ్మవారికి గతంలో కంటే ఈయేడు బోనాల జాతర ఉత్సవాలను మరింత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. అమ్మవారికి బోనాలు సమర్పించడంతో పాటు ఘటం ఊరేగింపు ఘనంగా నిర్వహిస్తాం. భక్తులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా తగిన చర్యలు తీసుకుంటున్నాం.

– రాయికోటి బాబురాజా, ఆలయ కమిటీ అధ్యక్షుడు

బోనాలకు అధిక నిధులు కేటాయించాలి



మంత్రి కొండా సురేఖకు వినతి పత్రం ఇస్తున్న రాజేశ్ కుమార్ తదితరులు

చార్మినార్: ఆషాఢ మాసం బోనాల జాతర ఉత్సవాలను పురస్కరించుకుని దూద్ బౌలి మహారాజ్ గంజ్‌లోని పోచమ్మ ఆలయానికి అధిక నిధులు కేటాయించాలని బహదూర్ పురా నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి పులిపాటి రాజేశ్ కుమార్ కోరారు. ఈమేరకు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు శనివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పాతబస్తీలోని చిన్నచిన్న దేవాలయాలకు సైతం దేవాదాయ శాఖ నుంచి ఇస్తున్న ఆర్థిక సాయాన్ని మరో 10 శాతం ఎక్కువ పెంచాలన్నారు. అలాగే మహారాజ్ గంజ్‌లోని పోచమ్మ ఆలయానికి గతేడాది ఇచ్చిన రూ.1,10,000 లను రూ.3 లక్షలకు పెంచాలని మంత్రిని కోరినట్లు ఆయన తెలిపారు.

శ్రీవైష్ణవ కులస్తుల జనగణన చేపట్టాలి



సమావేశంలో శ్రీవైష్ణవ ప్రతినిధులు

సుల్తాన్‌బజార్: శ్రీవైష్ణవ కులస్తుల జనగణన చేపట్టాలని శ్రీ వైష్ణవ జేఏసీ నాయకుడు పీచర కృష్ణమాచార్యులు డిమాండ్ చేశారు. శ్రీ వైష్ణవ విస్తృత స్థాయి సమావేశాన్ని శనివారం నిర్వహించగా, రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి 200 లకు పైగా హాజరయ్యారు. ప్రముఖ సింగర్ రామాచారి పాల్గొని మాట్లాడుతూ..ఐక్యంగా ఉండి సమస్యలను సామరస్యంతో పరిష్కరించుకోవాలన్నారు. జేఏసీ చైర్మన్ కృష్ణమాచారి మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో సభ్యత్వ నమోదు చేపడుతామన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కాందూరి నరేంద్రచార్యులు రవికుమార్, సత్యనారాయణ చార్యులు, యాదగి ఆచార్యులు, లక్ష్మీనారాయణాచార్యులు, రాష్ట్ర దేవాదాయ శాఖ అర్చక ఉద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు కాందూరి కృష్ణమాచార్యులు పాల్గొన్నారు.

సదస్సులతో వైద్య విద్యార్థులకు మేలు

- వైద్య విద్యా సంచాలకుడు డాక్టర్ నరేంద్రకుమార్
- ఫిస్టుల్లా కాన్- 2025 సదస్సు ప్రారంభం



సదస్సులో డీఎంఈ నరేంద్రకుమార్ తదితరులు

సుల్తాన్‌బజార్: సదస్సుల నిర్వహణతో వైద్య విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందని వైద్య విద్యా సంచాలకుడు డాక్టర్ నరేంద్రకుమార్ అన్నారు. జనరల్ సర్జరీ విభాగం అధిపతి ప్రొఫెసర్ డాక్టర్ పల్లం ప్రవీణ్ నేతృత్వంలో పిస్టుల్లాకాన్- 2025 సదస్సును కోఠిలోని ఉస్మానియా మెడికల్ కళాశాల ఆడిటోరియంలో శనివారం నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ..డాక్టర్ పల్లం ప్రవీణ్ నేతృత్వంలో లైవ్ సర్జరీల ద్వారా రెండు రోజుల పాటు సదస్సును నిర్వహించడం.. వందలాది మంది వైద్య విద్యార్థులు హాజరుకావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఉస్మానియా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ రాజారావు, ఉస్మానియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాకేశ్ సహాయ్, సదస్సు చీఫ్ ప్యాట్రన్ డాక్టర్ డి.మోహన్‌దాస్, ఆర్గనైజింగ్ చైర్మన్ పల్లం ప్రవీణ్, డాక్టర్ ఉమాకాంత్ గౌడ్, ఐలయ్య, బొంగు రమేశ్, మోక్ష ప్రసున్న, రంగా అజ్మీరా, జీవన్‌రావ్, మత్తయ్య వర్గీస్, డాక్టర్ జగదీశ్వర్‌తో పాటు వివిధ శాఖల వైద్యులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు మెగా జాబ్‌మేళా

అబిడ్స్: తెలంగాణ రాష్ట్ర లోక్‌దళ్ ఆధ్వర్యంలో మినిస్ట్రీ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్, ఎంట్రప్రెన్యూర్‌షిప్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ తెలంగాణ సంయుక్తంగా ఈనెల 16న నిజాం లా కాలేజ్ గ్రౌండ్స్‌లో మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఆర్గనైజింగ్ కార్యదర్శి విశాల్ వంజరి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. కేంద్ర స్కిల్ శాఖ మంత్రి జయంత్ చౌదరి, కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి డి.శ్రీధర్‌బాబు, తెలంగాణ రాష్ట్ర లోక్‌దళ్ పార్టీ అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్సీ కె.దిలీప్ కుమార్, ఎమ్మెల్సీ అంజిరెడ్డి మేళాను ప్రారంభిస్తారని తెలిపారు. 80 కార్పొరేట్ కంపెనీలు, 40 స్కిల్ కంపెనీలు, 6 జాతీయ బ్యాంకులు పాల్గొనున్నట్లు పేర్కొన్నారు. ఈ మేళాలో స్కిల్ మేళా–లోన్‌మేళా కూడా ఉంటుందని యువకులు, నిరుద్యోగులకు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

నేడు బాలాంజనేయ ఆలయ ద్వితీయ వార్షికోత్సవం



జియాగూడ: శివ పంచాయతన బాలాంజనేయ స్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవాన్ని ఆదివారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం స్వామివార్లకు విశేష అభిషేకం, ఆంజనేయస్వామికి చందన పూజ, హారతులు, మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వితరణ, అనంతరం అన్నప్రసాద వితరణ ఉంటుందన్నారు. గురు మదనానంద సరస్వతీ స్వామి వారి ఆశీస్సులతో నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

భక్తులకు ఇబ్బందుల్లేకుండా చర్యలు



పనులు ప్రారంభిస్తున్న ఎర్మనీ కైలాష్ గంగపుత్ర

గౌలిపురా: బోనాలకు వచ్చే భక్తులకు ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకుంటున్నామని గౌలిపురా మహంకాళి మాతేశ్వరి భారత మాత, కోట మైసమ్మ ఆలయం కమిటీ అధ్యక్షుడు ఎర్మనీ కైలాష్ గంగపుత్ర పేర్కొన్నారు. జీహెచ్ఎంసీ నిధులు రూ.16 లక్షలతో ఆలయం వద్ద చేపట్టిన సీసీ రోడ్డు పనులను శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో ముఖ్య సలహాదారులు కె.జ్ఞానేశ్వర్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి ఎ.మధుసూదన్ గిరి, ఉపాధ్యక్షులు మామిడి కృష్ణ, బి.వై.శ్రీకాంత్, కోశాధికారి బొడ్డు సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించాలి

పంజగుట్ట: రాష్ట్రంలో తాజా మాజీ సర్పంచులకు ఇవ్వాల్సిన పెండింగ్ బకాయిలు పూర్తిగా చెల్లించిన తర్వాతే ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని, లేనిపక్షంలో గ్రామాల్లో ప్రజలందర్నీ ఐక్యం చేసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటువేయిస్తామని తెలంగాణ మాజీ సర్పంచులు హెచ్చరించారు. ఈ మేరకు శనివారం ఎర్రమంజిల్‌లోని పంచాయతీరాజ్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టి అనంతరం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ క్రాంతిదళ్ అధ్యక్షుడు డాక్టర్ పృథ్వీరాజ్ యాదవ్, సర్పంచుల సంఘం అధ్యక్షుడు యాదయ్య మాట్లాడుతూ.. రాష్ట్రంలో మొత్తం 12,769 గ్రామ పంచాయతీలు ఉంటే ప్రతీ గ్రామ పంచాయితీకి బిల్లులు పెండింగ్ ఉన్నాయని అన్నారు. గత ప్రభుత్వంలో ఇందిరాపార్క్ వద్ద బిల్లుల కోసం నిరసన చేస్తుంటే ప్రస్తుత సీఎం, అప్పటి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి తమకు సంఘీభావం తెలిపి మన ప్రభుత్వం రాగానే పెండింగ్ బిల్లులు అన్నీ ఇస్తాం, మీ సమస్యలన్నీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చాడని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 17 నెలలు అవుతున్నా ఇప్పటి వరకు పెండింగ్ బకాయిలు ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి నాగయ్య, ఉపాధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

పంజగుట్ట: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సేవా సంఘం, అపోలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రేమనగర్‌లోని అంబేడ్కర్ భవన్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు కేహెచ్ భగవాన్‌దాస్ తెలిపారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు వైద్య శిబిరం కొనసాగుతుందన్నారు. ఈ అవకాశాన్ని స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

లోక్ అదాలత్‌తో కేసుల సత్వర పరిష్కారం



రాజీ పత్రాన్ని అందజేస్తున్న చీఫ్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ కర్ణకుమార్



కేసులు పరిష్కరిస్తున్న కోర్టు చీఫ్ జడ్జి శశిధర్ రెడ్డి, జడ్జిలు, న్యాయవాదులు

సిటీ కోర్టులు: లోక్ అదాలత్‌లో పెండింగ్ కేసుల సత్వర పరిష్కారం అవుతాయని రంగారెడ్డి జిల్లా చీఫ్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ కర్ణకుమార్ అన్నారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు రంగారెడ్డి జిల్లా కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్‌ను ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లోక్ అదాలత్‌లో పెండింగ్ కేసులు పరిష్కరించుకోవడమే కాకుండా సివిల్ కేసుల్లో చెల్లించిన కోర్టు రుసుం కూడా తిరిగి పొందవచ్చన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి శ్రీ వాణి మాట్లాడుతూ..రంగారెడ్డి జిల్లావ్యాప్తంగా 22 లోక్ అదాలత్ బెంచీలు ఏర్పాటు చేసి రాజీకి ఆమోదయోగ్యమైన క్రిమినల్ కేసులు, సివిల్, మోటార్ వాహన ప్రమాదబీమా, బ్యాంకు రికవరీ కేసులు అన్ని కలిపి సుమారు 2,05,000 పై చిలుకు కేసులు పరిష్కరించామని పేర్కొన్నారు. అలాగే అన్ని కేసుల్లో కలిపి రూ.5,24,82,919 వరకు నష్ట పరిహారాన్ని కక్షిదారులకు ఇప్పించామని తెలిపారు.

హైదరాబాద్ సిటి సివిల్ కోర్టులో..

యాకుత్‌పురా: పురానీహవేలీలోని హైదరాబాద్ సిటి సివిల్ కోర్టులో శనివారం జాతీయా లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా చీఫ్ జడ్జి శశిధర్ రెడ్డి ఆధ్వర్యంలో పెండింగ్ కేసులు 693, ప్రీలిటిగేషన్ కేసులతో పాటు మొత్తం 1234 కేసులను పరిష్కరించి బాధితులకు రూ. 43,42,93,069 కోట్ల నష్టపరిహారాన్ని నిర్ణయించామని కోర్టు న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కిరాణ్మహి తెలిపారు. జడ్జిలు ఉదయ్ కుమార్, నాగేశ్వర్ రావు, సురేశ్, అనామిక, న్యాయవాదులు పాల్గొన్నారు.

గోషామహల్ టీటీఐలో పాము కలకలం



గన్‌ఫౌండ్రీ: గోషామహల్ ట్రాఫిక్ శిక్షణ కేంద్రంలో శనివారం పాము కలకలం సృష్టించింది. అయితే మలక్‌పేట్ ట్రాఫిక్ కానిస్టేబుల్ వెంకటేశ్ నాయక్ వచ్చి పామును పట్టుకోవడంతో అందరు ఊపిరి పీల్చుకున్నారు. ఈ సందర్భంగా టీటీఐ ఇన్‌స్పెక్టర్ హరీశ్ మాట్లాడుతూ.. పామును జూ అధికారులకు అందజేసినట్లు తెలిపారు.

ప్రైవేటు స్కూళ్లల్లో 25 శాతం ఫ్రీ సీట్లు ఇవ్వాలి



మాట్లాడుతున్న ధర్మా నాయక్

సంతోష్‌నగర్: హైదరాబాద్ విద్యా హక్కు చట్టం ప్రకారం పేద విద్యార్థులకు ప్రైవేటు స్కూళ్లల్లో 25 శాతం ఫ్రీ సీట్లు ఇవ్వాలని గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ధర్మా నాయక్ అన్నారు. తెలంగాణ గిరిజన సంఘం హైదరాబాద్ దక్షిణ విభాగం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2009లో విద్యా హక్కు చట్టం ప్రకారం ఫ్రీ సీట్లు ఇవ్వాలని చెబుతుందని, ప్రైవేటు యజమాన్యాలు భారీగా ఫీజులు పెంచి పేద విద్యార్థులకు విద్యను దూరం చేస్తున్నాయని అన్నారు. ప్రభుత్వం తక్షణమే ప్రైవేటు యజమాన్యాలతో మాట్లాడి పేద విద్యార్థులకు విద్యను అందించే విధంగా ఫ్రీ సీట్లు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు వి.రామ్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.బాలు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సకల కళలకు ప్రసిద్ధి తెలంగాణ



గన్‌ఫౌండ్రీ: సకల కళలకు తెలంగాణ ప్రసిద్ధి అని రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్ గుప్తా అన్నారు. రవీంద్రభారతిలో భారత ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకుని ధూంధాం తెలంగాణ పేరిట సాంస్కృతిక కార్యక్రమాలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రాష్ట్రవ్యాప్తంగా అనేక జానపద, వారసత్వ కళలు ఉన్నాయని వాటిని వెలుగులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. అంతకు ముందు కళాకారుల నిర్వహించిన సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అలాగే పలువురు నాట్య గురువులను సన్మానించారు. కార్యక్రమంలో సినీ నటుడు జేఎల్ శ్రీనివాస్, భగవద్గీత కల్చరల్ ఫౌండేషన్ సీఈఓ స్వాతి, భారత ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు లలితరావు, లయన్ కేవీ రమణారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'ఎర్నెస్టో చెగువేరా' జయంతి వేడుకలు



హిమాయత్‌నగర్: గెరిల్లా పోరాట యోధుడు, ధైర్యశాలి, మానవత్వ విలువలు కలిగిన మహనీయుడు 'ఎర్నెస్టో చెగువేరా'అని అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు, కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్ర అన్నారు. శనివారం చేగువేరా 97వ జయంతిని హిమాయత్‌నగర్‌లోని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా చెగువేరా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర నేతలు నెర్లకంటి శ్రీకాంత్, వెంకటేశ్వర్లు, నానబాల రామకృష్ణ, బిజ్జ శ్రీనివాసులు, టి.సత్య ప్రసాద్, మహేందర్, శ్రీమాన్, కొండల్, రాష్ట్ర సమితి సభ్యులు మహేష్, ఉపేంద్ర, సల్మాన్ బేగ్, శివకుమార్, రాజేష్, మహమూద్, మాజీద్, మహేష్, మధు తదితరులు పాల్గొన్నారు.

పాతబస్తీలో తాగునీటికి ఢోకా లేదు

- 20 కేఎల్ వరకు ఉచిత నీటి సరఫరా
- బోనాల ఉత్సవాలకు నీటి సమస్య లేకుండా చర్యలు
- ఎమర్జెన్సీ ఫిర్యాదులకు 155313 టోల్ ఫ్రీ నంబర్
- 'సాక్షి' ఇంటర్వ్యూలో పాతబస్తీ జలమండలి సీజీఎం నాగేందర్ కుమార్



చార్మినార్: పాతబస్తీలో తాగునీటికి ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకుంటున్నామని జలమండలి డివిజన్–2 సీజీఎం నాగేందర్ కుమార్ తెలిపారు. అలాగే వర్షాకాలంలో వరదలతో లోతట్టు ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం మాన్సూన్ సిబ్బందితో స్పెషల్ టీంలు చేసిందని ఇందులో జలమండలి అధికారులు, సిబ్బందితో పాటు జీహెచ్ఎంసీ, ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ తదితర విభాగాల వారు ఉంటారని వారిని సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతామన్నారు. ముఖ్యంగా జలమండలి ఆధ్వర్యంలో మ్యాన్‌హోల్ కవర్స్ సరిచూసుకోవడంతో పాటు కొత్తవి వేయడం తదితర పనులను హాట్‌స్పాట్స్ కింద చేపడుతున్నామని ఏయిర్ టెక్ వెహికల్‌తో నలుగురు సిబ్బందితో జీప్‌లో స్పెషల్ టీం వానాకాలంలో 24/7 అందుబాటులో ఉంటారన్నారు. అలాగే రానున్న ఆషాఢ మాసం బోనాల జాతర ఉత్సవాలకు సైతం యాక్షన్ ప్లాన్ రెడీ చేశామని 'సాక్షి'కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన తెలిపారు.

సాక్షి: తాగునీటి సరఫరాతో పాటు వరద సమస్యలు తలెత్తితే ఎవరిని సంప్రదించాలి..?

జవాబు: ఎక్కడైన సమస్యలు తలెత్తితే 155313 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చు.

నీటి సరఫరా ఎలా ఉంది..?

నీటి సరఫరా విషయంలో ఎలాంటి ఫిర్యాదులు లేవు. రోజుకు 30 మిలియన్ గ్యాలన్ల తాగునీటి సరఫరా జరుగుతోంది.

డివిజన్–2 పరిధిలో ఎన్ని రిజర్వాయర్లున్నాయి..?

చంచల్‌గూడ, ఆస్మాన్‌ఘడ్, వినయ్‌నగర్ తదితర మూడు రిజర్వాయర్లున్నాయి.

మీ డివిజన్ నుంచి ఎక్కడివరకు నీటి సరఫరా జరుగుతోంది..?

యాకుత్‌పురా, మలక్‌పేట్ నియోజక వర్గాల ప్రజలకు కుళాయిల ద్వారా నీటి సరఫరా జరుగుతోంది. అలాగే అవసరమైన వారికి నిబంధనల మేరకు ట్యాంకర్ల ద్వారా కూడా నీటిని అందిస్తున్నాం.

20 కేఎల్ వరకు ఉచిత తాగునీటి సరఫరా పథకం కొనసాగుతోందా..?

20 వేల కిలోలీటర్ల వరకు ఉచిత నీటి సరఫరా కొనసాగుతూనే ఉంది.

కొంతమందికి బిల్లులు వస్తున్నాయంట..?

వర్కింగ్ కండిషన్‌లో ఉన్న మీటర్‌ను ఫిట్ చేసుకోవాలి. నాట్ వర్కింగ్ కండిషన్ ఉంటే బిల్లులు వస్తాయి.

ఇలాంటి వారు ఏం చేయాలి..?

నూతన మీటర్‌ను బిగించుకుని ఆధార్ కార్డుతో పాటు ఇంటి ఆస్తి పన్ను రసీదును జత చేస్తే 20 కేఎల్ వరకు ఉచితంగా తాగునీటి సరఫరా చేస్తాం. ఇది ఎప్పుడైనా చేయించుకోవచ్చు. కొంతమందికి పాత బకాయిలు ఉన్నందున వాటిని చెల్లించాలని సంబంధిత జలమండలి అధికారులు, సిబ్బంది కోరుతారు.

కార్యాలయాలు, అధికారుల గురించి చెప్పండి..?

డివిజన్–2 పరిధిలో జనరల్ మేనేజర్ శ్యాంసుందర్ నాయక్‌తో పాటు చంచల్‌గూడ, మలక్‌పేట్, వినయ్‌నగర్ తదితర మూడు సబ్ డివిజన్లకు ముగ్గురు డీజీఎంలు, ఒక్కో డీజీఎం పరిధిలో ముగ్గురు జలమండలి మేనేజర్లు ఉన్నారు.ముసారాంబాగ్, ఆస్మాన్‌ఘడ్, సైదాబాద్, సంతోష్‌నగర్, మాదన్నపేట్, వినయ్‌నగర్, చంచల్‌గూడ, ఆజంపురా, యాకుత్‌పురా తదితర సెక్షన్లు ఉన్నాయి.

పని చేయని బోరింగ్‌ల పరిస్థితి ఏమిటి..?

ప్రస్తుతం సరిపడా నీటి సరఫరా ఉన్నందున బోరింగ్‌ల అవసరం పెద్దగా లేదు. అయితే కొన్ని ప్రాంతాల్లో బోరింగ్‌లు సక్రమంగా పని చేస్తున్నాయి. ఎక్కడైనా రిపేరు ఉన్నట్లు అధికారులకు ఫిర్యాదు చేస్తే మరమ్మత్తులు చేయిస్తాం.